కేంద్రంలో మూడోసారి మోదీ సర్కార్

- రాష్ట్రంలో 10 ఎంపీ స్థానాలు గెలుస్తాం
- నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్, పాల్గొన్న ఎమ్మెల్యే ధన్‌పాల్, దినేష్ కులాచారి

సుభాష్‌నగర్: కేంద్రంలో మూడోసారి మోదీ సర్కార్ ఏర్పాటు కావడం కాయమని ఎంపీ అర్వింద్ ధర్మపురి ధీమా వ్యక్తం చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో పది ఎంపీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధిస్తారన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ఈసారి బీజేపీకి 370 ఎంపీ స్థానాలు, ఎన్‌డీఏకు 400లకు పైబడి స్థానాలు వస్తాయని తెలిపారు. ఉత్తర భారతదేశంలో కాంగ్రెస్‌కు ఒక్క ఎంపీ స్థానం రాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ అభ్యర్థి భారీ మెజార్టీతో విజయం సాధిస్తాడని, ద్వితీయ స్థానంలో కాంగ్రెస్, మూడోస్థానంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఉంటాడని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో దేశంలో అర్హులైన ప్రతి వ్యక్తి లబ్ధి పొందుతున్నాడని, ఆ విషయం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం ద్వారా తెలిసిందని తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో 7లక్షలకు పైగా ఆయూష్మాన్ భారత్ కార్డుదారులు, 70వేలకుపైగా ఉజ్వల యోజన కనెక్షన్లు, ప్రతి ఇంటికి కిసాన్ సమ్మాన్ పథకం లబ్ధిదారులు ఉన్నారన్నారు. మహిళా సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం నయా పైసా కేటాయించడం లేదని, పూర్తి నిధులు కేంద్రానివేనని పేర్కొన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కవిత పోటీ చేయాలని ఆ పార్టీ నాయకులు ధర్నా చేయాలని హితవుపలికారు. పసుపు ఎగుమతులకు జిల్లాను ప్రత్యేక క్లస్టర్‌గా ప్రకటించారని, అలాగే వన్ డిస్ట్రిక్ట్ - వన్ ప్రొడక్ట్ తర్వాత పసుపు ధర పెరుగుతోందని తెలిపారు. పసుపుబోర్డు పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని, ధర తగ్గే అవకాశమే లేదని, రాబోయే రెండేళ్లలో పసుపు ధర క్వింటాలుకు రూ.20వేలు దాటుతుందన్నారు. తనకు ఎలాంటి సెక్యూరిటీ అవసరం లేదని, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డికి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, ఆయనకు రక్షణ కల్పించాలన్నారు. అనంతరం అయోధ్యకు సైకిల్‌పై వెళ్లిన బజరంగ్‌దళ్ కార్యకర్తలను ఎంపీ సన్మానించారు. ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, నాయకులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, స్రవంతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యారంగంపై నిర్లక్ష్యం సరికాదు



తెయూ(డిచ్‌పల్లి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంపై నిర్లక్ష్యం వహించడం సరికాదని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్‌మూర్తి పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల మినీ సెమినార్ హాల్‌లో మంగళవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కాషాయీకరణను పెంచి పోషిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి, యూనివర్సిటీలకు అధికంగా నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అధ్యాపకులు పున్నయ్య, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీలకు అధిక నిధులు కేటాయించాలి



తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర బడ్జెట్‌లో యూనివర్సిటీలకు తక్కువ నిధులు కేటాయించడం సరికాదని, అధికంగా నిధులు ఇవ్వాలని తెలంగాణ యూనివర్సిటీ పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి జయంతి అన్నారు. ఈమేరకు తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ఎదుట మంగళవారం తెయూ పీడీఎస్‌యూ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. జయంతి మాట్లాడుతూ.. వర్సిటీలు అభివృద్ధి చెందాలంటే అత్యధిక నిధులు కేటాయించాలన్నారు. నాయకులు రవీందర్, అక్షయ్, హన్మండ్లు, నవ్య,రేణుక, ప్రవీణ, ఆకాష్ పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఎస్‌ఎస్‌ఆర్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఇందూరు మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తహీనత (ఎనీమియా)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐఎంఏ అధ్యక్షుడు దామోదర్‌రావు మాట్లాడుతూ.. ఖర్జూరం, బెల్లం, నల్ల నువ్వులు, తేనె, బాదం, జీడిపప్పులను తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్య రాకుండా చూసుకోవచ్చన్నారు. సమస్య రాకుండ తగిన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. కొట్టూరు శ్రీశైలం, హెచ్‌ఎం భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూతపడిన చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించండి



నిజామాబాద్‌నాగారం: మూడపడిన చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించాలని తెలంగాణ చెరుకు రైతుల వేదిక కన్వీనర్ తుల రాజేందర్ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం చెరుకు ఉత్పత్తిదారుల సంఘం, రైతు ఉత్పత్తిదారుల సంఘం, అఖిల భారత రైతు కూలీ సంఘ అధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. సదస్సులో రాజేందర్ మాట్లాడుతూ.. గత పాలకుల తప్పుడు విధానాలతోనే బోధన్ చక్కెర ఫ్యాక్టరీ మూతపడిందన్నారు. సారంగాపూర్ ఎన్‌సీఎఫ్ సహకార రంగంలోని చక్కెర ఫ్యాక్టరీని గత పాలకుల వారు ఆక్రమించుకోవడానికి కుట్రపన్నుతున్నారన్నారు. ఫ్యాక్టరీలపై ఉన్న అప్పులన్నీ మాఫీ చేసి తక్షణమే తెరిపించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆకుల పాపయ్య, వేల్పూర్ భూమయ్య, సాయిరెడ్డి, పృథ్వీరాజ్, నాగయ్య, శ్రీనివాసు, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యారంగానికి అధిక నిధులు హర్షణీయం'



నిజామాబాద్‌అర్బన్: గత ప్రభుత్వం కంటే ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగానికి అధిక నిధులు కేటాయించడం అభినందనీయమని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ధర్మేందర్ అన్నారు. నగరంలోని సంఘ కార్యలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు శ్రీనివాస్, శ్రీకాంత్, మల్లయ్య, యాదగిరి, సురేందర్, సాయిబాబా, అఫ్జల్, రవీందర్‌గౌడ్, వెంకటనారాయణగౌడ్, సన ఉద్దీన్ పాల్గొన్నారు.

ఏఎన్‌ఎం, నర్సులను కొనసాగించాలి


కలెక్టరేట్‌కు తరలివచ్చిన హెల్త్ సూపర్‌వైజర్లు

సుభాష్‌నగర్: గురుకుల పాఠశాల, కళాశాలల్లో తాత్కాలిక హెల్త్ సూపర్‌వైజర్లను ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో స్టాఫ్ నర్సు, ఏఎన్‌ఎంగా కొనసాగించాలని వారు డిమాండ్‌చేశారు. ఈమేరకు మంగళవారం వారు నగరంలోని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసేందుకు తరలివచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తాము 8ఏళ్లుగా తాత్కాలిక ప్రాతిపదికన పని చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కొత్తగా హెల్త్ సూపర్‌వైజర్లు రావడంతో తాము ఉపాధిని కోల్పోయామని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో తమ సేవలను కొనసాగించాలని కోరారు. సంజీవ్, సౌందర్య, శృతి, శ్వేత, మౌనిక, ప్రతిమ, సాయికుమార్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని బడులపై చర్యలు తీసుకోండి



నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో ప్రభుత్వ నిబంధనలు పాటించలని పలు ప్రయివేటు బడులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం నగరంలోని విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. నాయకులు దేవిక, మనోజ్, వంశీ, రాజు పాల్గొన్నారు.

30శాతం నిధులు కేటాయించాలి

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించారని, కనీసం 30శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ నాయకులు కోరారు. నగరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పునరాలోచన చేసి విద్యారంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. నాయకులు ఇంద్రసేన, దుర్గాదాస్, మణికంఠ, గోపి పాల్గొన్నారు.



సంక్షిప్తం

డిచ్‌పల్లి ఎంపీడీవోగా రవీందర్




డిచ్‌పల్లి: మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా రవీందర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎంపీడీవో గోపిబాబు కామారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లగా.. సంగారెడ్డి ఎంపీడీవో రవీందర్ డిచ్‌పల్లికి బదిలీపై వచ్చారు. ఆయనకు ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, సూపరింటెండెంట్ నివేదిత, పంచాయతీ కార్యదర్శులు శుభాకాంక్షలు తెలియజేశారు.

అయోధ్యకు తరలిన బీజేపీ నాయకులు



సిరికొండ: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు మంగళవారం అయోధ్యకు తరలి వెళ్లారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేక రైలులో వారు అయోధ్యకు వెళ్లారు. నాయకులు తాళ్ల శ్రీనివాస్, రంజిత్ రెడ్డి, సతీష్, శంకర్, సాయగౌడ్ పాకాల గంగాధర్, శ్రావణ్‌రెడ్డి, అజయ్, రాజు వెళ్లారు.

19నుంచి శ్రీవారి ఉత్సవాలు



సిరికొండ: మండలంలోని తూంపల్లి ఎదురు కొండపై గల వేంటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 19 నుంచి 21 వరకు వార్షిక ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఉత్సవాలకు హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం జిల్లాకేంద్రంలో ఎంపీ అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారిని ఆహ్వానించారు. వారికి ఆహ్వాన పత్రికలు అందజేశారు. రాజు మురళి గంగాధర్ తదితరులు వారిని కలిశారు

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

జక్రాన్‌పల్లి: మండలంలోని చింతలూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు దాత కొలిప్యాక్ సింగిల్ విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్ తన కుమారుడు శృనిత్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని దుస్తులను పంపిణీ చేశారు. హెచ్‌ఎం లచ్చన్న, సొసైటీ డైరెక్టర్ తిరుపతిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ లింబాద్రి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఇందల్వాయి: మండలంలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన తలారి గంగదాసు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి మంగళవారం మండల అంబేడ్కర్ సంఘం తరపున రూ.33వేలు, బీజేపీ గ్రామ శాఖ తరపున రూ.30 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. నాయకులు కిష్టయ్య, కుమార్, గంగాధర్, కన్నె చిన్ను, మనోహర్ ఉన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని సార్వజనిక్ స్మశాన వాటిలో మంగళవారం ఓ అనాథ మృతదేహానికి ఇందూరు యువత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అంత్యక్రియలు నిర్వహించారు. మద్దుకూరి సాయిబాబు, కాసుల సాయితేజ, మద్ది గంగాధర్, జయదేవ్, వినయ్ పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



సుభాష్‌నగర్: టీఎన్‌జీవో కేంద్ర సంఘం డైరీ, క్యాలెండర్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని సంఘ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ అలుక కిషన్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, ప్రధానకార్యదర్శులు నేతికుంట శేఖర్, సాయిలు, కేంద్రబాధ్యులు పోల శ్రీనివాస్, ఎం సతీష్, తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూమిపై నోటీసులు జారీ

ఇందల్వాయి: మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామ శివారులోగల భూమిపై కోర్టు కేసు ఉన్నందున అట్టి భూమిపై హక్కుల కోసం ప్రయత్నిస్తున్న బంజారా సేవా సంఘం, ముస్లిం కమిటీ సభ్యులకు ఆర్డీవో ఆదేశాల మేరకు మంగళవారం నోటీసులు జారీ చేసినట్లు సీఐ మల్లేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కేసు పరిష్కారం అయ్యేంత వరకు సదరు భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉంటుందని, ఇరు వర్గాలు అట్టి భూమిలోకి ఫిబ్రవరి 14నుంచి 16 వరకు వెళ్లవద్దని నోటీసుల్లో పేర్కొన్నారు. నోటీసులను అతిక్రమించినచో చర్యలు తీసుకుంటామని ఎస్సై వెల్లడించారు.

కొనసాగుతున్న స్వచ్ఛత వారోత్సవాలు

నిజామాబాద్ రూరల్: మండలంలోని 19 గ్రామాల్లో స్వచ్ఛతా వారోత్సవాలు మంగళవారం కొనసాగాయి. ఈసందర్భంగా గ్రామాల్లో శుభ్రతా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గుండారం గ్రామంలో జీపీ సిబ్బంది రోడ్ల వెంబడి చెత్తను శుభ్రం చేశారు. అదేవిధంగా గ్యాస్ కన్షెన్‌ల వినియోగదారులు (కంజూమర్)నెంబర్‌లను గ్రామాల్లో ప్రత్యేక అధికారులు చేపట్టారు. గ్రామ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారులతో పాటు గుండారం పంచాతీ కార్యదర్శి సుధకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలతో నష్టాలు

నిజామాబాద్‌అర్బన్: మూఢ నమ్మకాలతో అనేక నష్టాలు జరుగుతాయని విజ్ఞాన దర్శిని రమేష్ అన్నారు. నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సైన్స్ డే సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన విజ్ఞాన దర్శిని ఆధ్వర్యంలో విజ్ఞాన యానం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. శాస్త్రీయ దృక్పథంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, భారతి, రాజు, జయప్రద, సునీత, రఫీ యాస్మిన్, దేవిదాస్, వజీర, భాను, రాము, భార్గవి, రషీద్, చంద్రకళ, పద్మ పాల్గొన్నారు.

ఫిబ్రవరి 14న వీర జవాన్ల దివస్ నిర్వహించాలి



సుభాష్‌నగర్: జిల్లాకేంద్రంతోపాటు మండలకేంద్రాల్లో ఫిబ్రవరి 14న వీర జవాన్ల దివస్‌గా జరుపుకోవాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు దినేష్ ఠాకూర్ పిలుపునిచ్చారు. నగరంలోని విశ్వహిందూపరిషత్ కార్యాలయంలో మంగళవారం బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో వీర జవాన్ల దివస్ కరపత్రాలు ఆవిష్కరించారు. దినేష్ ఠాకూర్ మాట్లాడుతూ.. యువత ప్రేమికుల రోజు పేరుతో తిరుగుతూ దేశ వ్యతిరేకులుగా తయారవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వీర జవాన్ల దివస్‌గా జరుపుకుని అమరవీరులకు శ్రద్ధాంజలి తెలియజేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, సహ కార్యదర్శి దాత్రిక రమేష్, కోశాధికారి శేఖర్, నాయకులు శ్రీనివాస్, రామ్ చటర్జీ, సతీష్, సురేష్, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



డిచ్‌పల్లి: మండలంలోని బర్ధీపూర్ గ్రామంలోని హరిహర క్షేత్రంలో బ్రహ్మోత్సవ వేడుకలు మంగళవారం మూడోరోజు కొనసాగాయి. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. నేడు హరిహరుల కల్యాణం, చక్రస్నానం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్‌లో వేంకటేశ్వర స్వామి ఆలయంలో భూనీలా సమేత బంగారు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన కుంకుమార్చన, స్వామి వారి కల్యాణోత్సవానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వీడీసీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ప్రేమికుల దినోత్సవం ప్రత్యేకం..

ప్రపంచ ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రేమ వివాహాలు చేసుకొని, జీవితంలో స్థిరపడిన పలువురి మనోగతాలు ..

ప్రేమను చివరిదాకా నిలుపుకోవాలి..



నిజామాబాద్ రూరల్: మా ప్రేమను పెద్దలు ఒప్పుకొని, పెళ్లిచేశారు. ఇప్పుడు మాకు ఇద్దరు కూతుర్లు. మేము ప్రేమ పెళ్లి చేసుకుని హాయిగా జీవిస్తున్నాము. ప్రేమించడం కాదు.. ఆ ప్రేమను పెళ్లిగా మలచి, ఊపిరి ఉన్నంతవరకు నిలుపుకోవాలి.

–అంబట్ల ప్రవీణ్ కుమార్–సంజన, ధర్మారం

అన్యోన్యంగా ఉంటున్నాం..



మోపాల్(నిజామాబాద్‌రూరల్): ప్రేమ పెళ్లికి పెద్దలు నిరాకరించడంతో, మాధవనగర్ సాయి బాబా ఆలయంలో స్నేహితుల సమక్షంలో మా పెళ్లి జరిగింది. కొద్దిరోజులకు బంధువుల సమక్షంలో పెళ్లిచేశారు. 40 ఏళ్ల జీవితం సంతోషంగా గడిచిపోయింది. ఒకరినొకరం అర్థం చేసుకుంటూ, ఎంతో అన్యోన్యంగా ఉంటున్నాం.

– చంద్రశేఖర్ గౌడ్–రేణు మిశ్రా, బాడ్సి

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర పథకాల బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ధన్‌పాల్.. కార్పొరేటర్లను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని నాగారంలో మంగళవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర–2 కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. దేశ అభివృద్ధే లక్ష్యంగా ప్రధాని మోదీ పని చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే క్యాలెండర్లు, పథకాల కరపత్రాలు, బుక్‌లెట్స్ ఆవిష్కరించారు. అనంతరం లబ్ధిదారులు తమ అనుభవాలను కార్యక్రమంలో పంచుకున్నారు. ఎల్‌డీఎం నాగ శ్రీనివాస్, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మనాయక్, నాయకులు, కార్పొరేటర్లు నాగోళ్ల లక్ష్మీనారాయణ, స్రవంతిరెడ్డి, మాస్టర్ శంకర్, ఇప్పకాయల కిషోర్, సుధీర్, ప్రవళిక శ్రీధర్, మెట్టు విజయ్, సుక్క మధు, ఆకుల శ్రీనివాస్, వీరేందర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో విజయం సాధిస్తాం..

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఇందూరు ఎంపీ స్థానంలో బీజేపీ అభ్యర్థి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం 39, 50 డివిజన్ల కార్పొరేటర్లు నిచ్చెంగ్ లత కృష్ణ, బట్టు రాఘవేందర్ బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే ధన్‌పాల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, సుమిత్ర కిషోర్, వెల్డింగ్ నారాయణ పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి


ధర్పల్లిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ధర్పల్లి: జాతీయ రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న జరుగుతున్న దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం బంద్–సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఓమయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధానాలతో రైతులు, కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే మూడు రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు చక్రపాణి, శారద, లత, విజయ్, గాంధీ, సునీత పాల్గొన్నారు.

మోపాల్: మండలంలోని బాడ్సిలో మంగళవారం ఆటో స్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో 'దేశవ్యాప్త గ్రామీణ బంద్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీఐటీయూ నాయకులు కఠారి రాములు, కృష్ణ, గుండారం అశోక్, హన్మండ్లు, విఠల్, రాజారాం, షౌకత్ అలీ, సాయిలు, దిలీప్, శ్రీనివాస్, రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి


నగరంలో ధర్నా నిర్వహిస్తున్న ఆలయాల పరిరక్షణ సమితి ప్రతినిధులు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని శంభుని గుడి ఆలయము, నీలకంఠేశ్వర ఆలయ ఆవరణలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని దేవాలయ పరిరక్షణ సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వారు మున్సిపల్‌కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. సమితి కన్వీనర్ పటేల్ ప్రసాద్ మాట్లాడుతూ.. హిందువులు అతిపవిత్రంగా భావించే ఆలయ ప్రాంగణం చుట్టూ అన్యమతస్తులు అక్రమంగా దుకాణాలను ఏర్పాటు చేశారన్నారు. వెంటనే అధికారులు ఆలయాన్ని సందర్శించి, అక్రమ దుకాణాలను తొలగించాలని కోరారు. నీలకంఠేశ్వర స్వామి ఆలయం ఆస్తులు కూడా అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలన్నారు. నాయకులు బంటు రామరాజు, ప్రతాప్, మురారి, ప్రవీణ్, యోగేష్, రాహుల్, మనీ, రవి శ్రీకాంత్, చైతన్య పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	64,200	వెండి (కిలో)	75,200
22 క్యారెట్స్	59,200		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	180
		లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	45	60
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	40	70
జిరకాయ	40	60	దోసకాయ	20	40
దొండకాయ	30	50	ఆలుగడ్డ	16	30
బీర్నీసుకాయ	30	60	గోబిగడ్డ	20	40
కాకరకాయ	60	80	గోబిపువ్వు	20	40
వంకాయ	10	20	బీట్‌రూట్	20	40
పాలకూర	20	40	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	60	80
కొత్తిమీర	15	30	గోరుచిక్కుడు	60	80
పుదీనా	25	50	చిక్కుడుకాయ	50	60
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఈగల్ (తెలుగు) - 10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2	యాత్ర-2 (తెలుగు) - 1.30, 10.35 అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్ (తెలుగు) 4.35, లాల్ సలామ్ (తెలుగు) 7.35
స్క్రీన్-3	ట్రూ లవర్ (తెలుగు) - 10.40, 1.35, 4.25, 10.30 హనుమాన్ (తెలుగు) - 7.25

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	లాల్ సలామ్ (తెలుగు) - 12.00, 3.15, 9.45 హనుమాన్ (తెలుగు) - 6.30
స్క్రీన్-2	ఈగల్ (తెలుగు) - 12.20, 7.00 హనుమాన్ (హిందీ) - 3.40 ట్రూ లవర్ (తెలుగు) - 10.20
స్క్రీన్-3	తేరి బాతోమే (హిందీ) - 10.15 ట్రూ లవర్ (తెలుగు) - 4.20 యాత్ర-2 (తెలుగు) 1.25, 7.25, 10.20
స్క్రీన్-4	కెమెరామెన్ (తెలుగు) - 12.25, 6.45 తేరి బాతోమే (హిందీ) - 3.40, 6.50, 10.00
దేవి	హనుమాన్ (తెలుగు)
నటరాజ్	కిస్మత్ (తెలుగు)
లలితామహల్	ఈగల్ (తెలుగు)
విజయ్	లాల్ సలామ్ (తెలుగు)- 11.15, 6.15 యాత్ర-2 (తెలుగు) - 2.15, 9.15